




ఏచూరికి అరుణాంజలి



మృత్యు మొ(కొ)గిలి

7గురు దుర్మరణం

ఘాట్‌లో భారీ ప్రమాదం
ఆర్టీసీ బస్సు, లారీలు ఢీ
31 మందికి తీవ్ర గాయాలు
సిఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
మృతులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా

ప్రజాశక్తి - బంగారుపాళ్యం (చిత్తూరు జిల్లా)

నిన్న గురువారం సాయంత్రం తిరుపతి జిల్లా భాకరాపేట ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. టమోటా లోడ్‌తో వెళుతున్న కంటైనర్ మలుపు వద్ద కారుపై పడడంతో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు.. ఈ ఘటన మరువక ముందే శుక్రవారం సాయంత్రం బంగారుపాళ్యం సమీపంలోని మొగిలి ఘాట్‌లో బస్సును లారీ ఢీకొన్న ఘటనలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. దాదాపు 33 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో తొమ్మిదిమంది పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఘటనా స్థలాన్ని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోల్, జేసీ విద్యాధరి పరిశీలించారు. పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. ఘటనపై సిఎం చంద్రబాబునాయుడు, రోడ్డు రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించారు. పోలీసుల వివరాల మేరకు...

బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్‌లో బెంగుళూరు నుంచి వైజాగ్ వెళుతున్న లారీ (ఎపి 15 టిబి 7777) అదుపు తప్పి డివైడర్‌ను దాటి తిరుపతి నుంచి బెంగుళూరు వెళుతున్న ఆర్టీసీ బస్సును (ఎపి 03 జడ్ 5419) ఢీకొంది. ఆ స్పీడుకు ఆర్టీసీ బస్సు వెనక్కి తిరిగి వెనక వస్తున్న లారీని (ఎపి 03టిజి 7619) ఢీకొంది. రెండు లారీల మధ్య బస్సు ఉండడంతో బస్సులోని అందరికీ గాయాలయ్యాయి. సంఘటన స్థలంలోనే ఆరుగురు అక్కడి కక్కడే మృతిచెందారు. క్షతగాత్రులను పలమనేరు ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు మృతిచెందారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియో ప్రకటించింది. గాయపడిన వారికి చిత్తూరు, బంగారుపాళ్యం, పలమనేరు, కుప్పంలలో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. పలమనేరు, పూతలపట్టు ఎంఎల్‌ఎలు అమరనాథ్‌రెడ్డి, మురళీమోహన్‌లు పలమనేరు ఆస్పత్రుల్లో క్షతగాత్రులను పరామర్శించారు.

రూ.10 లక్షలు ఇవ్వాలి : సిపిఎం

రోడ్డు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మొగిలి ఘాట్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించి, నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

మృతుల వివరాలు

1. ఆర్టీసీ డ్రైవర్ మనోహరన్ (56) తిరుపతి 2. ఎస్.విజయమ్మ (53) పాకాల మండలం కంభాలమిట్ట, 3. హన్సిక యాదవ్ (6) మహారాష్ట్రకు చెందిన మహారాజ్ గంజ్ వాస్తవ్యుడు అశుతోష్ యాదవ్ కుమార్తె 4. బాలరాజు తెలంగాణా రాష్ట్రం సిద్దిపేట వాస్తవ్యుడు బాలయ్య కుమారుడు 5. లారీ డ్రైవర్ సోనుకుమార్ (31), ఉత్తరప్రదేశ్ రాష్ట్రం చిత్‌రంజల్ ప్రసాద్. 6. గంగాధర నెల్లూరు మండలం జంగాలపల్లికి చెందిన శంకర్‌రెడ్డి (48).

మొగిలి ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో 7 గురు మరణించగా అందులో ఆరుగురిని గుర్తించడం జరిగింది. పై ఫోటోలో ఉన్న మరొకరి ఆచూకీ ఎవరికైనా తెలిసిన వెంటనే బంగారుపాళ్యం ఇన్స్పెక్టర్ 9440796736 కు లేదా చిత్తూరు పోలీస్ కమాండ్ అండ్ కంట్రోల్ నెంబర్ 9440900005 కు తెలుపవలసిందిగా మనవి.

క్షతగాత్రులు వీరే...

తీవ్రంగా గాయపడిన వారు ఎక్కడివారన్నది తెలియరాలేదు. శివ (36), రిక్కీ (36), చిరంజీవి , బాబు రెడ్డి, మురళి ,అస్మిత్ యాదవ్ , పద్మావతి (54), , లావణ్య (23), అమరనాథ్ (40) వీరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. వీరు స్పృహలో లేని కారణంగా వీరి వివరాలు తెలియరాలేదు.


చిత్తూరుకు చెందిన మంజుల, శ్రీనివాస్, బెంగళూరుకు చెందిన సక్కుబాయి, విష్ణు, కళ్యాణ్ ,వెంకటేష్, రితిష్కి , కష్ణ , జమిందామాలతి, బేబీ జాస్మిన్, రితిక , రక్షిత, భాస్కర్ రెడ్డి, ఒరిస్సా కి చెందిన ప్రశాంత్ కుమార్ నేతాజీ ,చిరంజీవి, చెన్నైకి చెందిన శ్రీధర్ బారెడ్డిపల్లి మండలానికి చెందిన వెంకటరమణ, పలమనేరు కు చెందిన అక్రమ్ ముబారక్ గాయపడ్డారు. వీరిని పలమనేరు, చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

108 సిబ్బందిపై కలెక్టర్ సీరియస్

ఘటనా స్థలం నుంచి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం తరలించేందుకు 108 సిబ్బంది అంగీకరించకపోవడంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. కలెక్టర్ సిబ్బందిని మందలిస్తూ 'మీరు వాహనంలో తీసుకెళ్లకపోతే నేనే మృతదేహాలను వాహనాల్లో తరలిస్తాను' అని మండిపడడంతో సిబ్బంది మృతదేహాలను తీసుకెళ్లేందుకు అంగీకరించారు.

మృత్యు మలుపులు..!

నిన్న భాకరాపేటలో...నేడు మొగలి ఘాట్‌లో..



ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఘాట్ రహదారుల్లో మృత్యు మలుపులు ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయి.. చంద్రగిరి జాతీయ రహదారిలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నా, నివారణా చర్యలు శూన్యమనే చెప్పాలి. రోడ్డు భద్రతా వారోత్సవాలు పేరుకే తప్ప, ప్రమాదాల నివారణలో ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఘటన జరిగినప్పుడే తప్ప, ఆ తరువాత చర్యలు లేవన్న విమర్శలూ లేకపోలేదు.

చంద్రగిరి మండల పరిధిలో తిరుపతి– మదనపల్లి (వయా భాకరాపేట), పూతలపట్టు – నాయుడుపేట(వయా ఐతేపల్లి) రహదారులలో మలుపులే ప్రయాణికుల పాలిట యమపాశాలుగా తయారయ్యాయి. ప్రధానంగా తిరుపతి – మదనపల్లి జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్లో ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. భాకరాపేట ఘాట్‌రోడ్డు మలుపు వద్ద తరచూ ప్రమాదాలు సంభవించడం వల్ల ప్రాణ నష్టం సంభవించడమే కాకుండా, శరీర అవయవాలను పోగొట్టుకొని వైకల్యం పొందిన వ్యక్తులు చాలామంది ఉన్నారు. భాకరాపేట ఘాట్రోడ్లో జనవరి నుండి ఇప్పటివరకు మలుపు వద్ద మూడు ప్రమాదాలు సంభవించాయి. ఈ రోడ్డు ప్రమాదాలలో ఐదుగురు మతి చెందగా, పదిమందికి పైగా క్షతగాత్రులయ్యారు. పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిపై కర్ణాటక, తమిళనాడు, వివిధ ప్రాంతాల నుండి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లే భక్తులు చాలామంది రోడ్డు ప్రమాదానికి గురై మత్యువాత పడ్డారు. 20 మందికి పైగా గాయాల పాలై అవయవాలను పోగొట్టుకున్న సందర్భాలు చాలా ఉన్నాయి. ఈ రెండు జాతీయ రహదారులలో మలుపులే..... ప్రమాదాలకు నిలయంగా మారాయి. జాతీయ రహదారులు ప్రధానంగా ప్రమాదాలు సంభవించడానికి కారణం సూచిక బోర్డులు సక్రమంగా లేకపోవడం, కల్వర్టుల వద్ద రెడ్ స్టిక్కర్లు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని ప్రయాణికులు అంటున్నారు. చంద్రగిరి మండలంలో ఈ రెండు జాతీయ రహదారులలో రోడ్డు ప్రమాదాలు ఫుల్ గా జరుగుతున్న ప్రమాదాల నివారణ చర్యలు మాత్రం నేషనల్ హైవే అథారిటీ అధికారులు, జిల్లా పోలీసు ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానిక ప్రజలు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఈ రెండు జాతీయ రహదారులలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు శ్రీవారి భక్తులు కోరుతున్నారు. తిరుపతి మదనపల్లి జాతీయ రహదారి భాకరాపేట ఘాట్ లో మలుపు వద్ద పెద్ద స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడం వల్ల కూడా ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహన చోదకులు అంటున్నారు. భాకరాపేట నుండి తిరుపతి మార్గం వైపు వచ్చే వాహనాలు ఘాట్ రోడ్ లో వేగంగా రావడం వల్ల స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి వాహనాలు బోల్తా పడుతున్నాయి. ఈ రెండు జాతీయ రహదారుల్లో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం. పోలీస్ అధికారులు, జాతీయ రహదారి సంస్థ అధికారులు సంయుక్తంగా రోడ్లను పరిశీలించి చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు. గురువారం భాకరాపేట ఘాట్ రోడ్ లో జరిగిన ప్రమాదాన్ని తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్ సుబ్బరాయుడు పరిశీలించి జాతీయ రహదారులలో ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారి అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు చేపడతామని తెలిపారు.

నివారణా చర్యలు చేపడతాం : పులివర్తి నాని



చంద్రగిరి మండలం, భాకరాపేట ఘాట్ రోడ్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం దారుణమని, ఎక్కడ నుంచో వచ్చి ఇక్కడ ప్రాణాలను కోల్పోతున్నారని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆవేదన వ్యక్తం చేశారు. భాకరాపేట కనుమ రహదారిలో ప్రమాదాలు నిత్య కత్యమయ్యాయి. ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఏదో ఒక ఘటన జరుగుతూనే ఉందన్నారు. జాతీయ రహదారి శాఖ అధికారులతో కలిసి ఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. అధిక లోడ్‌తో వాహనాన్ని కంట్రోల్ చేయలేక ప్రమాదాలు జరుగుతున్నాయని, సి.మల్లవరం జంక్షన్ నుంచి పీలేరు వరకు బైపాస్‌రోడ్డు పూర్తయితే ప్రమాదాలను అరికట్టవచ్చని ఎంఎల్‌ఎ తెలిపారు. అటవీ శాఖ నుంచి అనుమతులు పూర్తిచేసి రోడ్డు వైన్డింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

డీటీవోగా మురళీమోహన్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి(డిటివో)గా మురళీమోహన్ శుక్రవారం మంగళంలోని రవాణా శాఖ కార్యాలయంలో బాధ్యతలను స్వీకరించారు. నెల్లూరు జిల్లాలో మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మురళీమోహన్ కు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పించి తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారిగా నియమించింది. ఈ సందర్భంగా మురళీమోహన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివాణ కోసం తగు చర్యలు తీసుకుని ప్రమాదాల నివారణకు కషి చేస్తానన్నారు. రవాణాశాఖ నుంచి ప్రజలకు విశేషంగా సేవలను అందిస్తామన్నారు. అనంతరం జిల్లా రవాణాశాఖాధికారిగా బాధ్యతలు చేపట్టిన మురళీమోహన్ కు ఎంవీఐలు సుబ్రమణ్యం, కుసుమ, శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు.

నేటినుంచి 'స్వచ్ఛతా హి సేవ' : కమిషనర్

సెప్టెంబర్ 14 నుంచి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు నగరంలో నిర్వహించనున్న స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు విజయవంతం చేయాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల నిర్వహణపై శుక్రవారం నగరపాలక సంస్థ సమావేశం మందిరంలో ఇంజినీరింగ్, హెల్త్, ప్లానింగ్ విభాగపు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కషి ఫలితంగా పాకాల రైల్వే స్టేషన్ కు మహర్దశ పట్టనుంది. పాకాల ప్రజల చిరకాల కల నెరవేరనుంది. పాకాల రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో ఎనిమిది లైన్ల రైల్వే రహదారి మార్గాలతో పాటు.. కోచ్ ఫ్యాక్టరీని వచ్చే ఏడాది మార్చి నుంచి నిర్మించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జరిగిన సేఫ్టీ మీటింగ్లో పాకాల రైల్వే స్టేషన్ కు సంబంధించి, కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఆమోదం లభించింది. ఈ నేపథ్యంలోనే సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ గుంతకల్ డివిజనల్ ఆఫీస్ కు ఉత్తర్వులు జారీ అయ్యాయని, రైల్వే ఇంజనీరింగ్ అధికారులు వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు.

ఉత్తమ గురువులకు సత్కారం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సర్వేపల్లి రాధాకష్ణన్ జయంతి సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంతం నుంచి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన పలువురిని పిళ్ళారి పౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక సరస్వతీ బాయి మున్సిపల్ ఉన్నతపాఠశాల ఆవరణలోని పిళ్ళారి కళావేదికలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిళ్ళారి పౌండేషన్ నిర్వాహకురాలు పిళ్ళారి అమరావతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజ దిశ, దశకు అసలైన దార్శనీకులని కొనియాడారు. వారి ఆధ్వర్యంలోనే తరగతి గదుల్లో భావి భారత భవిష్యత్తు నిర్ణయించబడుతుందని తెలిపారు. అలాంటి ఉపాధ్యాయులను పిళ్ళారి పౌండేషన్ ఆధ్వర్యంలో సత్కరించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన కూనాటి సురేష్‌తో పాటు జిల్లా స్థాయి అవార్డులు పొందిన మరో 13 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. శ్రీకాళహస్తి ఎంఈఓ భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఛాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం

తిరుపతి టౌన్ : రామతులసి కల్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ వార్షిక సర్వసభ్య సమావేశం జరుగుతుందని అధ్యక్షులు మోహన్‌కుమార్ రాజు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో కార్యదర్శి వాసుదేవన్, బై అండ్ సేవ్ మధు, మలిశెట్టి రవి, కోదండ రామయ్య, చక్రపాణిలతో కలిసి మాట్లాడుతూ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు 36 అసోసియేట్ యూనియన్లు కలిసి పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి, చంద్రగిరి ఎంఎల్‌ఎలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, తిరుపతి ఎంపి గురుమూర్తి, మేయర్ డాక్టర్ శిరీష, మాజీ ఎంఎల్‌ఎ సుగుణమ్మ, బిజెపి నేత భానుప్రకాష్‌రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు విశిష్ట అతిథులుగా హాజరుకానున్నారని తెలిపారు.

ఎస్వీయూతో ఎనలేని అనుబంధం : మాజీ వీసీ
'వామపక్షాల వెలుగురేఖ'కు అడుగడుగునా నివాళి

ప్రజాశక్తి - క్యాంపస్, యంత్రాంగం

కమ్యూనిస్టు సిద్ధాంతాలకు వెన్నెముకగా నిలిచి, తద్వారా దేశ ప్రగతి కోసం, పీడిత వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడ్డ యోధుడిగా సీతారాం ఏచూరి చరిత్రలో నిలిచిపోతారని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య రాళ్ళపల్లి రామమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారాం ఏచూరి మతి నేపథ్యంలో ఆయన శుక్రవారం సంతాప సందేశాన్ని వెలువరిస్తూ పలు జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. 1995లో ఎస్వీయూ సెనేట్ హాల్లో నాటి వీసీ రామమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో సీతారాం ఏచూరి 'దేశప్రగతిలో ఉన్నతవిద్య ప్రాధాన్యం –దేశాభివద్ధిలో యువత భాగస్వామ్యం' గురించి ఏచూరి చేసిన అద్భుతమైన ప్రసంగాన్ని ఆయన గుర్తుచేశారు. సీతారాం ప్రసంగానికి నాటి విద్యార్థులు, ఉద్యోగులు ముగ్దులయ్యారని పేర్కొన్నారు. అటు తర్వాత పలు సందర్భాల్లో, పార్లమెంట్ సమావేశాల్లోనూ సీతారాం ఏచూరి విశ్వవిద్యాలయాల ప్రగతి కోసం పాటుపడ్డారని పేర్కొన్నారు. సీతారాం ఏచూరి మరణం దేశానికి తీరని లోటని రామమూర్తి పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులు, అభిమానులు ఈ విషాదం నుంచి త్వరితగతిన పూర్వస్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మాజీ వీసీ రామమూర్తికి సీతారాం ఏచూరి సమీప బంధువు కావడం గమనార్హం.

ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవి అధ్యక్షతన సంతాప సభ జరిగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి పాల్గొని ప్రసంగించారు. భారత రాజకీయాల్లో అత్యున్నత విలువకు ప్రతిరూపం సీతారాం ఏచూరి అని, వారి వారసులుగా జీవించడమే వారికి ఇచ్చే సరైన నివాళి అని అన్నారు. సంపన్న కుటుంబంలో జన్మించినా చివరికంటా పేదల కోసమే పరితపించారని గుర్తు చేశారు. చదువుకై పోరాడు... చదువుతూ పోరాడు అనే నినాదాన్ని దేశవ్యాప్తంగా ముందుకు తీసుకురావడంలో సీతారాం ఏచూరి కీలక పాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు జి. నాగ వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నేతలు అక్బర్, అశోక్, వినోద్, నరేంద్ర, వీరేష్ తదితరులు పాల్గొన్నారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య మురళీధర్, ఆచార్య పద్మనాభం, ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, జయచంద్ర, సాయిలక్ష్మి, అక్బర్, అశోక్, బండి చలపతి, చిన్న పాల్గొన్నారు.



- **వెంకటగిరిలో** తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఆధ్వర్యంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజల పట్ల అంకితభావంతో తుదిశ్వాస వరకూ పనిచేశారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యలను నిరంతరం అధ్యయనం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, వివి రమణయ్య పాల్గొన్నారు.



- **శ్రీకాళహస్తిలో..** సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో శ్రేణులు శుక్రవారం అశ్రు నివాళి అర్పించారు. సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని, ఆయన మరణం కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య, రెడ్డెప్ప ప్రొఫెసర్ ఎస్ఎం పరీఫ్ అన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను కూడగట్టి ఒకటితాటిపైకి తేవడంలో ఏచూరి అవిశ్రాంతంగా పోరాడారని గుర్తు చేశారు. ఏచూరి వారసులుగా నేటితరం కమ్యూనిస్టులు ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గంధం మణి, రెడ్డెప్ప సురేష్, కుమార్, అన్వర్ బాషా పాల్గొన్నారు.

- **నాగలాపురంలో..** సుందరయ్య కాలనీలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. ఏచూరి అజాతశత్రువని కొనియాడారు. నాయకులు నాగలాపురం మురగేషన్, దినమణి, అమ్ముదా, సుబ్బమ్మ, గిరిజ, పద్మ, దేవా, జీవా పాల్గొన్నారు.
- ఏర్పేడులో రైతుసంఘం జిల్లా కార్యదర్శి హేమలత, రంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ, గురవమ్మ ఆధ్వర్యంలో సంతాపం తెలిపారు.
- పుత్తూరులో అంబేద్కర్ సర్కిల్ వద్ద వర్ధన్ ఆటోస్టాండ్‌లో సిపిఎం కార్యదర్శి ఆర్.వెంకటేష్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం పున: ప్రతిష్ట

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సంగీత సామ్రాజ్ఞి ,భారతరత్న ఎం.ఎస్ సుబ్బలక్ష్మి విగ్రహాన్ని శుక్రవారం తిరుపతి నగరంలో పూర్ణకుంభం సర్కిల్ వద్ద యథాస్థానంలో పున్హ ప్రతిష్టించారు. శ్రీ వేంకటేశ్వర సంగీత నత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దు బాల ప్రయత్నం, కషి ఫలితంగా టీటీడీ ఈవో , జెఈఓ, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్, మేయర్ సంపూర్ణ సహకారంతో ఎం ఎస్ సుబ్బలక్ష్మి విగ్రహం పున్హ ప్రతిష్టించడానికి ఎంతగానో దోహదం చేశాయి. ఈ సంవత్సరం సెప్టెంబర్ 16వ తేదీన జరిగే 108వ జయంతికి ముందే విగ్రహాన్ని ప్రతిష్టించడం ద్వారా సంగీతజ్ఞులు, సంగీత పోషకులు సంగీతాస్వాదకులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ విగ్రహ పున్హ ప్రతిష్ట కార్యక్రమంలో శ్రీ వేంకటేశ్వర సంగీత నత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా ముద్దు బాల, గాత్ర విభాగాధిపతి శబరి గిరీశం పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం- కేసు నమోదు

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట పట్టణంలోని ప్రముఖ ప్రవేటు విద్యాసంస్థలో 6వ తరగతి చదువుతున్న షేక్ అఫ్రీన్ అనే బాలిక అదృశ్యమైన ఘటనలో కేసు నమోదు చేసినట్లు సూళ్లూరుపేట ఎస్సై బ్రహ్మానాయుడు తెలిపారు. శుక్రవారం తెల్లవారు జామున ట్యూషన్ కు వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి రాలేదన్నారు. ఎవరైనా బాలిక ఆచూకీ తెలిస్తే సూళ్లూరుపేట పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరుపేట జూనియర్ జడ్జ్ కోర్టు ఆవరణలో నేషనల్ లోక్ అదళత్ జరుగునని బార్ అసోసియేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కేసులను రాజీ చేసుకోవాలని తెలిపారు.

వరద బాధితులకు తపస్య విద్యార్థుల విరాళం

ప్రజాశక్తి - రేణిగుంట



ఇటీవల రాష్ట్రంలో సంభవించిన అధిక వర్షాల కారణంగా నష్టపోయిన వరద బాధితులకు తపస్య ఇంగ్లీష్ మీడియం పాఠశాల రేణిగుంట వారు తమ వంతు సహాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్‌కు రూ.40వేల చెక్కును అందజేశారు. వరదల్లో బాధితుల ఘటనలకు చలించిపోయిన విద్యార్థులు తమవంతు విరాళంగా అందజేశారని తెలిపారు.

ముక్కంటికి వెండి గిన్నెల వితరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా ఉత్సవాలకు వాడుకునేందుకు రూ.1.15లక్షల విలువ చేసే వెండి గిన్నెలను శ్రీకాళహస్తికి చెందిన మదన్మోహన్ నాయుడు అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలసి శుక్రవారం విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు, వేదపండితులు ఈ విరాళం స్వీకరించారు. దాతకు కతజ్ఞతలు తెలియచేసి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అదేవిధంగా స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వరద బాధితులకు చేయూత


వరద బాధితులకు దుస్తులు తీసుకెళుతున్న వ్యాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరుటౌన్ : గూడూరులోని దువ్వూరు రమణ మ్మ మహిళా కళాశాల యాజమాన్యం వరద బాధితులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు అందించారు. దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల విద్యార్థినులు వరద బాధితులకు సేకరించిన దుస్తులను తీసుకువెళుతున్న వాహనాన్ని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు డి ఆర్ డబ్ల్యు కళాశాల యాజమాన్యం లక్ష రూపాయల విరాళం అందించారు. వరద బాధితులకు దుస్తులు అందించడంలో విద్యార్థినులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు మానవత్వంతో ప్రజలు ముందుకు రావాలని కోరారు.

పుత్తూరు టౌన్ : వరద బాధితుల సహాయార్థం పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వై కోటేశ్వరయ్య అనుమతితో శుక్రవారం విరాళాలు సేకరించారు. విద్యార్థుల సేకరించిన 27 వేల రూపాయలను సిఎం సహాయనిధికి ఇవ్వాలని కోరుతూ డిడిని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి కోటేశ్వరయ్య అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి అధికారి డాక్టర్ యం శ్రీనివాసులు, ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ కె శ్రీనివాసులు, రఘురామన్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు డిడిని అందిస్తున్న పుత్తూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్

తిరుపతి సిటీ: విజయవాడ వరద బాధితుల సహాయార్థం తిరుపతి సిపిఐ నాయకులు లక్ష రూపాయల విలువ చేసే వస్త్రాలు సేకరించి విజయవాడకు పంపామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి శుక్రవారం తెలిపారు. గత రెండు రోజులుగా తిరుపతి పట్టణంలో వస్త్ర వ్యాపారుల నుండి వీటిని సేకరించారు. ఐదు బస్తాలలో వస్త్రాలను సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణకి విజయవాడలో అందించారు. అక్కడ సిపిఐ శ్రేణులు వరద ప్రాంతాలలో నిరాశ్రయులకు వీటిని అందిస్తారని తెలిపారు.

ఎస్‌వియులో ముగిసిన పీజీ సెట్ సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పిజి వివిధ కోర్సులలో చేరే విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీ సెట్ – 2024 లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సీట్లను ఆయా సంబంధిత విభాగాలలో కేటాయించేందుకు ప్రత్యక్షంగా ఒరిజినల్ సర్టిఫికెట్లను ఎస్వీయూలోని డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో నిర్వహించామని డిఓఏ అధికారులు పేర్కొన్నారు. మొత్తం 1291 మంది విద్యార్థులకు 827 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో అడ్మిషన్లు పొందారని, ఆర్ట్స్ విభాగంలో 68 శాతం సైన్స్‌లో 64 శాతం, కామర్స్ విభాగంలో 57 శాతం మంది విద్యార్థులు అడ్మిషన్స్ పొందారని తెలిపారు. గత సంవత్సరంతో పోల్చితే 20 శాతం ఎక్కువగా మొదటి దశలో అడ్మిషన్లు పెరిగాయని పేర్కొన్నారు.

ఆచార్య సుధాకరయ్యకు యుఎస్‌లో సభ్యత్వం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గణితశాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్న సుధాకరయ్యను అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన ఏడోఎక్స్పియా సంస్థ ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ లాంగ్వేజెస్ సొసైటీ పక్షాన కౌన్సిల్ మెంబరుగా ఎంపిక చేసింది. వారిని ఎస్వియూ ఉపకులపతి ఆచార్య అప్పారావు అభినందించారు. ఆచార్య సుధాకరయ్య ఒక సంవత్సరం పాటు ఆ సంస్థలో సభ్యులుగా వుంటారు.


సభ్యత్వ పత్రం అందిస్తున్న విసి

ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్

హెచ్‌పి గ్యాస్ సేల్స్ ఆఫీసర్ సురేష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: గ్యాస్ వినియోగదారులు డెలివరీ బాయ్స్‌కు గ్యాస్ బుక్ చేయగానే వచ్చే నాలుగు అంకెల ఓటీపీ చెబితేనే గ్యాస్ సిలిండర్ ఇస్తారని హెచ్‌పి గ్యాస్ సేల్స్ ఆఫీసర్ సురేష్, ఎల్ పీజీ డిస్ట్రిబ్యూటర్ రవికుమార్ తెలిపారు. శుక్రవారం వారు రవి కుమార్ గ్యాస్ ఏజెన్సీ వద్ద బ్యానర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్టర్ మొబైల్ నుంచే గ్యాస్ బుక్ చేసుకోవాలన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయం వద్ద గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న హెచ్‌పి గ్యాస్ సేల్స్ ఆఫీసర్

ఎస్‌వియూలో కార్బన్ పాదముద్రపై వర్క్‌షాప్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జువాలజీ విభాగంలో 'బయో ఇ3, బయో సర్క్యులర్ ఎకానమీ' పై నిపుణులతో వర్క్ షాప్ శుక్రవారం నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ మధుసూధన్ రెడ్డి, డాక్టర్ సుబ్బారెడ్డి, హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) నుంచి డాక్టర్ రమేష్ హాజరైన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ ఆచార్య కేటీ రామకృష్ణారెడ్డి, కన్వీనర్‌గా జువాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్ వ్యవహరించారు. అధ్యాపకులు, విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమంలో బయో ఇంజినీరింగ్, బయో ఎకానమీ , పర్యావరణ సుస్థిరతతో కూడిన బయో ఈ3 ప్రాముఖ్యత, ప్రపంచం ఎదుర్కొనే సవాళ్లను చర్చించారు. వ్యర్థాలను తగ్గించడానికి, కార్బన్ పాదముద్రలను తగ్గించడానికి , పునరుత్పాదక జీవ వనరులను ప్రోత్సహించడానికి , బయో ఈ3 అధునాతన జీవ సాంకేతికతలతో కూడిన స్థిరమైన పద్ధతులను ఎలా అవలంబిస్తారో తెలిపారు.

వరసిద్ధి వినాయకునికి ముక్కంటి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: చిత్తూరు జిల్లా కాణిపాకం వరసిద్ధి వినాయకునికి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ వీఎస్ఎన్ మూర్తి ఈ పట్టు వస్త్రాలను కాణిపాకం ఆలయ అధికారులకు సంప్రదాయ బద్ధంగా అందించారు. కాణిపాక వరసిద్ధి వినాయకుని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం తరపున ప్రతియేటా పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ.. ఇందులో భాగంగా ఈ ఏడాది వరసిద్ధునికి ముక్కంటి ఆలయం తరపున పట్టువస్త్రాలు అందించారు. ఎమ్మెల్యే వెంకటసుధీర్ రెడ్డికి పూతలపట్టు ఎమ్మెల్యేకు మురళీమోహన్ స్వాగతం పలికారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళ తాళాల మధ్య ఆలయ సాంప్రదాయాలతో వరసిద్ధి వినాయకస్వామికి పట్టు వస్త్రాలు ఆశీర్వదనం చేశారు. అనంతరం స్వామి వారి దర్శించుకున్నారు. ఆలయ వేదపండితులు ఈయనకు ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి శేషవస్త్రంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 1వ తేదీ నుంచి పదవ తేదీ వరకు తిరుపతి ఎన్‌సిసి నగర్‌లో నిర్వహించిన శిక్షణా శిబిరంలో వివిధ కళాశాలల నుంచి వివిధ విభాగాల్లో పాల్గొనగా శ్రీ పద్మావతి జూనియర్ కళాశాల విద్యార్థినులు 26 మంది అత్యుత్తమ ప్రతిభ కనబరచారని ప్రిన్సిపల్ డాక్టర్ సి భువనేశ్వరి, ఎన్‌సిసి ఇన్‌ఛార్జి వి తులసి పేర్కొన్నారు. శుక్రవారం అధ్యాపకులతో కలిసి వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడూ భారత సాయుధ దళాల విభాగంలో చేరడం వల్ల యువత క్రమశిక్షణ దేశభక్తి కలిగిన పౌరులుగా తీర్చిదిద్దవచ్చునని తెలిపారు. ఐక్యత, క్రమశిక్షణ అలవ డుతుందని ఇదే స్ఫూర్తి, పఠిమ ముమ్ముందు అన్ని రంగాల్లో కనపరచాలని కోరారు.

క్రీడాకారులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 14 ,15 ,16 వ తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీలలో పాల్గొననున్న క్రీడాకారులకు గూడూరులో టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్యాం సుందరరావు (మయూరి శ్యామ్ యాదవ్) దాతృత్వంతో శుక్రవారం క్రీడా దుస్తులు అందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే వారు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు పైడి కోటేశ్వరరావు, సెక్రటరీ పి. భాస్కర్ కలిచేడు హెడ్మాస్టర్ కె హరి, ప్రసాద్ రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: అనుమతి లేని వాహనాలను సిఐ ముత్యయ్య ఎస్ఐ విశ్వనాథ నాయుడును మండలంలోని బస్టాండ్ ఆవరణలో శుక్రవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా అనుమతులు లేని ద్విచక్ర వాహనాలను, ఆటో వాళ్లను ప్రత్యేకంగా పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాలకు అవసరమైన పేపర్సు, వాహనాల లైసెన్సులు సక్రమంగా ఉన్నాయా లేదని పరిశీలించి లేని వాహనాలకు పెనాల్టీ విధించారు. నిబంధనలు పాటించని ఆటోలకు జరిమానా విధించారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రజాశక్తి - తిరుపతి: తిరుపతి జిల్లాలోని అన్ని పాఠశాలలకు శనివారం సెలవని జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ తెలిపారు. సెప్టెంబర్ 2న అన్ని పాఠశాలలకు సెలవు ఇచ్చామని చెప్పారు. ఈ నేపథ్యంలో రెండో శనివారం (నేడు) పాఠశాలలు పని చేయాల్సి ఉండగా, కానీ దీనికి బదులుగా నవంబర్ 9వ తేదీ వర్కింగ్ డేగా నిర్ణయించినట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో శనివారం అన్ని విద్యా సంస్థలకు సెలవు ఉన్నట్లున్నామని తెలిపారు. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారులు, సిబ్బంది గుర్తించాలని పేర్కొన్నారు.

ఎక్సోటిక్ పార్క్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

- మినీ 'జూ'లా నిర్వాహకులు ఏర్పాటు
- ఉపాధి అవకాశాలపై ఎమ్మెల్యే హర్షం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామ పంచాయతీ కరకంబాడి ప్రధాన మార్గంలో ఉన్న రామచంద్ర నగర్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఏ టు జెడ్ ఎక్సోటిక్ పార్క్, రెస్టారెంట్ ను శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మంగళం పరిధిలో ఇలా ఉపాధి అవకాశాలు కల్పించే ఎక్సోటిక్ పార్క్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ ఎక్సోటిక్ పార్కు ద్వారా స్థానికంగా ఉన్న 35 మందికి అవకాశాలు పొందారన్నారు. ఏటు జెడ్ ఎక్సోటిక్ పార్కు నిర్వాహకులు హర్షవర్ధన్ మాట్లాడుతూ ఇలాంటి పార్కు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాలని ఒక డ్రీమ్ ప్రాజెక్టుగా దీన్ని ఎంచుకున్నానన్నారు. ఈ ఎక్సోటిక్ పార్క్ లో చిన్న పిల్లలు బాగా ఆటలాడుకునే విధంగా ఏర్పాట్లు చేశామని, ప్రత్యేకంగా విదేశాల నుండి తెచ్చిన పక్షులు, పాములు, వివిధ రకాల జంతువులు ఆకర్షణగా నిలుస్తాయన్నారు. ఎప్పుడూ చూడని విదేశీ జాతులకు చెందిన కోళ్ళు, పిట్టలు, మకావ్, ముంగిస, విదేశీ జాతికి చెందిన కుందేళ్లు, వివిధ రకాలైన చేపలు, పాములు, దేశీ జాతికి చెందిన గుర్రం, ఒంటె, వివిధ జాతులకు చెందిన కుక్కలు సందర్శకులు చూసి ఆనందానుభూతి కలిగిస్తాయన్నారు. ఏ టు జెడ్ ఎక్సోటిక్ పార్క్ అందించే ఆహ్లాదాన్ని సందర్శించి అనుభూతిని పొందాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డాలర్స్ దివాకర్ రెడ్డి, సునీల్, దినేష్, స్థానిక టిడిపి నాయకులు ఈశ్వరయ్య, గోపీనాథ్, మహేశ్వరి, చెన్నరాయప్ప, రాధాకృష్ణ, జ్యోతి కృష్ణ, జనార్ధన్, చిన్నరెడ్డిబాబు, చలపతి, ప్రభాకర్, రామకృష్ణ పాల్గొన్నారు.


పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాని


పార్కులో ఆకర్షిస్తున్న వివిధ రకాల కోళ్లు

రూ. అరకోటి విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచల అడవుల నుండి ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టడానికి ప్రత్యేక కార్యచరణతో సిబ్బందికి ఇచ్చిన సూచనలు ఫలితాలను ఇస్తున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్దగల టాస్క్ ఫోర్స్ కార్యాలయలో నంద్యాల జిల్లా చాబోలు మార్గం దగ్గర కర్నూలు నుండి కడప వైపు వచ్చిపోయే వాహనాలలో బయటపడ్డ రూ.62.5 లక్షల విలువ గల ఎర్రచందనం దుంగలు, రవాణా చేసిన మినీ లారీని టాస్క్ ఫోర్స్ ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. టాస్క్ ఫోర్స్ కడప ఆర్ ఐ చిరంజీవులు, ఆర్ఎస్ఐ నరేష్ వారి సిబ్బందితో గురువారం నంద్యాల జిల్లా చాబోలు మార్గం కర్నూలు నుండి కడప వైపు వచ్చే వాహనాలను తనిఖీ చేపట్టారన్నారు. కర్నూలు వైపు నుండి ఒక మినీ లారీ టాస్క్ ఫోర్స్ తనిఖీలను గమనించి పారిపోయే ప్రయత్నం చేయగా అడ్డుకొని నలుగురిని అదుపులోకి తీసుకున్నమన్నారు. వీరు ప్రకాశం, హైదరాబాద్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందినవారుగా గుర్తించామన్నారు. మినీ లారీలో పరిశీలించగా 54 ఎర్రచందనం దుంగలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై టాస్క్ ఫోర్స్ ఎస్సై రఫీ కేసు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

వరిలో మేలైన యాజమాన్యంతో అధిక దిగుబడి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : రాబోవు రబీలో వరిలో సరైన రకాల ఎంపిక, సక్రమ ఎరువుల యాజమాన్యంతో అధిక దిగులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏ డి ఏ భాస్కరయ్య తెలిపారు. వడమాలపేట మండలం టి.సి అగ్రహారంలో 'ఆత్మ' కింద రైతులకు శిక్షణ ఇచ్చారు. రబీలో రైతుల అధికంగా సాగు చేసే కె. ఎన్. యం.1638 రకానికి బదులు కె.ఎన్. యం. 733., ఆర్. ఎన్. ఆర్. 15048 కి బదులు ఎన్. ఎల్. ఆర్. 34449 రకాలను సాగు చేసుకోవాలని సూచించారు. వరిలో పైరుపై పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులను వాడరాదని తెలిపారు. దీనికి బదులు నాటిన తర్వాత మొదటి దఫా పైరుపై వేసే ఎరువులకు బదులు ఎకరానికి అర్థ లీటరు నానో యురియా, అర్థ లేటరు నానో డిఏపి కలిపి వాడకంతో మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. వరిలో కలుపు నివారణ, చీడల నివారణ గురించి ఏఓ వేణుగోపాలరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు ఏడిఏ రమేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు యమునా, మోహన్, దివ్య రైతులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో చెత్త తొలగింపు : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : ప్రధాన మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు పనులు రెండు మూడు రోజుల్లోపు త్వరగా పూర్తి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. శుక్రవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. నగరంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్ (జివిపి) లో చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని హెల్త్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి ఉన్నారు.

పోషక ఆహారంతోనే ఆరోగ్యం మెరుగు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: నారాయణవనం మండల పరిధిలోని కొండలచెరువు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సూపరువైజరు బేబీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గర్భిణీలు పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరువైజరు బేబీ, ఏఎన్ఎం ఇ లక్ష్మీదేవి, ఏంఎల్‌హెచ్‌పి. లోకేశ్వరి పాల్గొన్నారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం కొత్త గొల్ల కండ్రిగ అంగన్వాడి కేంద్రంలో సూపరువైజర్ టి మారియమ్మ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, తల్లులకు పౌష్టిక ఆహారం తీసుకుంటే రక్తహీనత రాకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది ఎం నలినాక్షి, ఏఎన్ఎం సి ఆర్ హేమశ్రీ అంగన్వాడి కార్యకర్తలు వెంకటసుబ్బమ్మ, గోవిందమ్మ, హిమబిందు, ప్రీ స్కూల్ పిల్లలు, ఆశా వర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్ వాడి సూపర్వైజర్ శిల్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ అంగన్‌వాడీ కేంద్రం లో పౌష్టికాహారం మాసొత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్స్ ను వైద్యాధికారులు, అంగన్వాడి అధికారులు తిలకించారు. అంగన్ వాడి కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఆయాలు, లబ్ధిదారులు పాల్గొన్నారు ఫోటో సమావేశం లో మాట్లాడుతున్న అంగన్వాడి సూపర్వైజర్ శిల్పా యమునా పాల్గొన్నారు.

రామచంద్రపురం: గర్భిణులకు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం వల్లే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని తిరుపతి జిల్లా ఐసిడిఎస్ పథక సంచాలకురాలు విజయలక్ష్మి అన్నారు. మండలంలోని రాయలచెరువు సెక్టార్ కుప్పంబాదురు అంగన్‌వాడీ కేంద్రంలో జాతీయ పోషక మసోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె గర్భవతులు, బాలింతలకు, కిషోర్ బాలికలు, యుక్త యువతులకు పోషక ఆహారం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి సిడిపిఓ ప్రదీప, కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజన కుమారి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు రాజేశ్వరి, సూపరువైజర్ రేవతి, ఏఎన్ఎం గిరిజ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీలో శుక్రవారం ఉదయం తల్లిపాల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో శిశువు పుట్టిన గంటలో పేలోపే తల్లిపాలు తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగు తుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పని సరిగా బిడ్డలకు పాలు తాగిం చాలని ఐసీడీ ఎస్ సూపరు వైజర్ శిల్ప తెలిపారు. మండ లంలోని బుచ్చి నాయుడు కండ్రిగ అంగన్‌వాడీ కేం ద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తల్లి పాలు, పౌష్టికాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

చంద్రబాబు సేవలు వెలకట్టలేనివి

టిడిపి బీసీ పాలఏకరి చిత్తూరు అధ్యక్షురాలు మల్లూరు దేవి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం: విజయవాడ వరద బాధిత ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు అందిస్తున్న సహాయక చర్యలు వెలకట్టలేనివని టిడిపి బిసి పాలేకరి చిత్తూరు పార్లమెంటు అధ్యక్షురాలు మల్లూరు దేవి అన్నారు. యర్రావారిపాలెం మండలంలో శుక్రవారం ఆమె విలేకరులతో ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ ఉన్న నాయకుడని ఆయన అనుభవమే రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి వైపు నడిపిస్తోందని కొనియాడారు. దేశం మొత్తం చంద్రబాబును ఆదర్శంగా తీసుకొని రాష్ట్రాల అభివృద్ధి కోసం పరితపిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూడలేక ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. చంద్రబాబును చూసి వరదల సహాయార్థం స్వచ్ఛందం గా చాలామంది ఆర్థిక సహాయం అందిస్తున్నారని, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని తన వంతు బాధ్యతగా విజయవాడ వరద ప్రాంతాల్లో పర్యటించి సేవా కార్యక్ర మాలు చేశారన్నారు. టిడిపి కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదేశాల మేరకు తను వంతు బాధ్యతగా స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో పేద బడుగు బలహీన వర్గాలకు సేవ చేయడానికి నేను సైతం సిద్ధంగా ఉంటానని దేవి ఆశాభావం వ్యక్తం చేశారు.



క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -దొరవారిసత్రం : స్విమ్స్, శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో దొరవారిసత్రం పిహెచ్ సి పరిధిలోని ఉచ్చూరు విలేజ్ హెల్త్ సెంటర్ లో క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలను శుక్రవారం ఉచితంగా నిర్వహించారు. ఈ క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో పింక్ బస్సు ద్వారా మొబైల్ క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు వేగంగా జరుగుతున్నాయని ఇందులో భాగంగా ప్రస్తుతం దొరవారిసత్రం పిహెచ్‌సి పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో దొరవారిసత్రం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వి చైతన్య, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి పద్మావతి, సర్పంచ్ వి పద్మమ్మ, పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాదర్ మస్తాన్, స్థానిక నాయకుడు పి శ్రీనివాసులు, నర్సింగ్ సిబ్బంది, స్థానిక వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం, మల్లేశ్వరి ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


క్యాన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నులిపురుగుల నివారణపై సమావేశం

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఈ నెల17వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం నిర్వహణపై మండల అధికారులకు ఎంపిడివో అధ్యక్షతన శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలో రెండుసార్లు నిర్వహించే నులిపురుగుల నివారణ కార్యక్రమం రెండవ విడత ఈ నెల 17వ తేదీ నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఒక సంవత్సరం బిడ్డ నుండి 19 సంవత్సరాల పిల్లలందరికీ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ఇంటి వద్ద వున్న పిల్లలందరికీ ఆల్బెండజోల్ టాబ్లెట్ మింగించాలని సూచించారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, పాఠశాల ఉపాధ్యాయ , ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్ పి లు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయ వంతం చేయాలని సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చేతులు, శరీర శుభ్రత, మరుగుదొడ్లు వినియోగం, రక్తహీనత, నులి పురుగుల నివారణపై వివరించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీవో త్రివిక్రమ రావు, వైద్యాధికారి డాక్టర్ దివాకర్, ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశులు, అంగన్‌వాడీ సూపరువైజర్ శిల్ప, విద్యాశాఖ సిబ్బంది, తహశీల్దారు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆరోగ్యాధికారులు

సొసైటీల కంప్యూటరీకరణ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో కంప్యూటరీకరణ చేస్తున్నామని డివిజనల్ సహకార శాఖ అధికారి రవి రాజశేఖర్ పేర్కొన్నారు. గూడూరు 24వ నెంబరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో డివిజనల్ సహకార శాఖ అధికారి రవి రాజశేఖర్ అధ్యక్షతన మహాజన సభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సంఘసభ్యులు కేవైసి డిటైల్స్‌ను సొసైటీకి అందించాలన్నారు. ఇక నుండి ఆన్‌లైను విధానంలోనే సహకార సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి రైతుకూ ఆన్‌లైను ద్వారా అన్ని సేవలు అందించేం దుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విద్యా సాగర్, పర్సన్ ఇన్‌ఛార్జి శ్యాం కుమార్, గూడూరు డిసిసిబి మేనేజర్ సత్యవతి, గూడూరు సిఇవో నారాయణ, తిప్ప గుంట పాలెం సిఇవో రామయ్య, గూడూరు పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు తెలుగు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, గూడూరు నెం 24 పిఎస్‌సిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కోట : కోట మండలం తిన్నెలపూడి పిఏసిఎస్‌లో పర్సన్ ఇన్‌ఛార్జి పి మహేష్ సింగ్, సంఘ సీఈఓ కే శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘ సభ్యుల కేవైసి, కేవైసి లేని సభ్యుల సభ్యత్వం రద్దు, పిఏసీఎస్ కంప్యూటరీ కరణ, తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మాజీ ఉప మండల అధ్యక్షులు గుర్రం అశోక్ కుమార్, సొసైటీ మాజీ డైరెక్టర్ కేతంరెడ్డి సురేంద్ర రెడ్డి, సొసైటీ మాజీ డైరెక్టర్ కర్లపూడి శ్యామ్ సుందర్, డీసీసీబీ కోట మేనేజర్ సాయి కేశవరామ్, డిసిసిబి కోట అసిస్టెంట్ మేనేజర్, సూపరవైజర్ వెంకటేశ్వర్లు, సొసైటీ మాజీ సీఈఓ వెంకట నరసరాజు, ఊనుగుంటపాలెం సీఈఓ, కొత్తపాలెం సీఈఓ, సిద్దవరం సీఈఓ, చిట్టేడు సీఈఓ, తదితరులు, సంఘ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు

క్రైం న్యూస్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- తడ: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. తడ మండల సమీపాన శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉత్తర ప్రదేశ్ కు చెందిన కామిల్ మాలిక్ (25) మృతి చెందాడు. తడ పోలీసుల కథనం మేరకు.. కామిల్ మాలిక్ స్క్రాప్ వ్యాపారం చేసుకుంటూ తడలో రూం అద్దెకు తీసుకుని వుంటున్నాడు. ఈ క్రమంలో పనిమీద చెన్నైకు బైక్ మీద వెళ్లి తడకు తిరిగి వస్తుండగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బైక్ పై నుండి డివైడర్ పై పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో గమనించిన స్థానికులు 108 సాయంతో శ్రీసిటీ లోని హాస్పిటల్ తరలించారు. అనంతరం అతని స్నేహితులు వచ్చి వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం అందించేందుకు చెన్నైకు తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. పోలీసులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రులకు నిధులు కేటాయించండి

ఆరోగ్య శాఖా మంత్రికి ఎమ్మెల్యే వినతి


మంత్రితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నగరి ఏరియా, పుత్తూరు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ కోరారు. శుక్రవారం ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను రాజధానిలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరి ఏరియా ఆస్పత్రి, పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పలు సమస్యలు వున్నాయని, రోగులకు అవసరమైన వసతులు సరిపోడం లేదని తగిన భవన నిర్మాణాలు, ఆసుపత్రుల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. స్పందించిన ఆరోగ్య శాఖ మంత్రి 'ఆస్పత్రులకు ఏవేవి అవసర మో వాటిని నివేదికలు పంపితే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

డ్రైవింగ్‌పై అవగాహన అవసరం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రతి ఒక్కరికీ డ్రైవింగ్‌పై అవగాహన అవసరమని ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. చదువుకున్న యువకులు సామాజిక బాధ్యతతో కూడిన వ్యాపారాలు ఎంచుకోవడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. గూడూరు రెండో పట్టణ పరిధిలోని నరసింగరావుపేటలో ఏర్పాటు చేసిన జూహి మోటార్ డ్రైవింగ్ స్కూలును ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూలులో సదుపాయాలు, శిక్షణ పొందే వారికి అందిస్తున్న సేవలను స్కూలు నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు . త్వరలో గూడూరు పట్టణంలో జాబ్ మేళా నిర్వహి స్తామని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో కిషోర్ , టిడిపి నాయకులు రహీం, చెంచురామయ్య , రత్నం , డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకులు చైతన్య పాల్గొన్నారు.

'హిందీ నేర్చుకుంటే ఉపాధి '

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : హిందీ భాష నేర్చుకోవడం వల్ల ఉపాధి అవకాశం ఎక్కువగా వుంటాయని గొల్లపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. పుత్తూరు రూరల్ మండలం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ భాషా హిందీ దినోత్సవాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యయురాలు అధ్యక్షతన హిందీ ఉపాధ్యాయులు ఎన్ శ్రీరాములు, జి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నాట్య ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. వ్యాస రచన, వక్తృత్వ, చిత్ర లేఖనం, తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జియో మ్యాపింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి -నాయుడుపేట: స్కూల్ కాంప్లెక్స్ అడ్జస్ట్‌మెంటులో భాగంగా శుక్రవారం నాయుడు పేట మండలంలో ఎంఈఓల సమక్షంలో నాయుడుపేట మున్సి పాల్టీ పరిధిలోని జెడ్పి బాలుర ఉన్నత పాఠశాలల సిబ్బందికి స్కూల్స్ మ్యాపింగ్‌పై శిక్షణ ఇచ్చారు. స్కూళ్లకు మ్యాపింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి తిరుపతి డీఈవో శేఖర్, అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శివ శంకరయ్య సందర్శించారు. వారి సూచనల మేరకు వారి వారి మండల పరిధిలోని కాంప్లెక్స్‌లకు స్కూల్స్‌ని మ్యాపింగ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఐఎస్‌లకు జియో మ్యాపింగ్ సంబంధించి శిక్షణ తరగతుల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట మండలం ఒకటవ ఎంఈఓ శాంతి, ద్వితీయ ఎంఈఓ బాణాల మునిరత్నం పాల్గొన్నారు.

సబ్సిడీ ఉలవలు పంపిణీ

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న 80 శాతం సబ్సిడీ ఉలవల విత్తనాలను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని బోడ్డివాండ్లపల్లిలో రైతులకు శుక్రవారం అందించారు. రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనాలు అందిస్తున్నామన్నారు. ఈ సబ్సిడీ విత్తనాలు ప్రతి రైతుకు అందేలా చూడాలని పక్కదారి పడితే చర్యలు తీసుకుంటామని అధికారులను హెచ్చరించారు.

సీతారాం ఏచూరికి అశ్రు నివాళి

ప్రజాశక్తి -నాయుడుపేట: నాయుడుపేట పెదనపర్తి సుందర్ రాంరెడ్డి భవన్ సిఐటియు కార్యాలయంలో సీతారాం ఏచూరికి అశ్రు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు శివకవి ముకుంద, యుటిఎఫ్ సీనియర్ నాయకులు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మార్క్సిజాన్ని భారతీయ పరిస్థితులకు వర్తింపజేసి విప్లవమే ఊపిరిగా సాగిన సీతారాం ఏచూరి మనం నేడు కోల్పోవడం అందరికీ తీరని లోటన్నారు. ఆయనకు జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె విజయమ్మ, సిఐటియు సభ్యుడు బి వీరా స్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు సునీల్, రజక సంఘం నాయ కులు పుట్టయ్య, యుటిఎఫ్ నాయకులు సుబ్బారావు పాల్గొన్నారు.

రుయా అభివృద్ధి కమిటీ సభ్యులుగా లక్ష్మీపతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా బండ్ల లక్ష్మీపతిని నియమిస్తూ ఆస్పత్రి సూపరింటెండెం ట్ డాక్టర్ రవి ప్రభు ఉత్తర్వులు జారీ చేశారు. ఆసుపత్రి ఛైర్మన్, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన నియామకం చేపట్టా మని, ఆస్పత్రి అభివృద్ధికి ఆయన కృషి చేయాలని సూచించారు.